# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 18-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమరావతి పర్యటన ఏర్పాట్లు పర్యవేక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆరుగురు మంత్రులు సభ్యులుగా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది.
- లోకానికి శాంతిని ప్రబోధించిన ఏసు క్రీస్తు మార్గం అనుసరణీయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక ఇంధన సౌకర్య కేంద్రాన్ని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి ఈరోజు సందర్శించారు.
- అంగన్వాడీ అధ్యాపకుల్లో ఆరోగ్యవంతమైన జీవనశైలి పెంపొందించడానికి చర్యలు చేపట్టామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు.

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమరావతి పర్యటన ఏర్పాట్లు పర్యవేక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆరుగురు మంత్రులు సభ్యులుగా ప్రత్యేక కమిటీని నియమిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయనంద్ ఈరోజు ఉత్తర్వులు జారీ చేశారు. మే 2వ తేదీన ప్రధానమంత్రి అమరావతిని సందర్శించి పెట్టుబడులు, అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమం పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన కమిటీలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి, ఆర్థిక శాఖ మంత్రి, ఐటీ శాఖ మంత్రి, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి, గనులు ఎక్సైజ్ శాఖ మంత్రులు సభ్యులుగా ఉంటారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్ రాష్ట్ర నోడల్ అధికారిగా ఈ కార్యక్రమాలను సమన్వయం చేస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

=====================

ప్రపంచంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక ఇంధన సౌకర్య కేంద్రాన్ని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఈరోజు సందర్శించారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పిన్నాపురంలో గ్రీన్ కో గ్రూప్ ద్వారా నిర్మించబడుతున్న పంప్డ్ స్టోరేజ్ హైడ్రోపవర్ ప్రాజెక్ట్‌లో ఏరియల్ సర్వే నిర్వహించారు.

ఈ ప్రాజెక్టు 4 వేల మెగావాట్ల సౌర, 1000 మెగావాట్ల పవన, 1,680 మెగావాట్ల పంపుడ్ స్టోరేజ్ ఉత్పత్తి చేస్తుంది. భారతదేశంలో క్లీన్ ఎనర్జీ ఉత్పత్తిలో ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందని ఈ సందర్భంగా కేంద్రమంత్రి అన్నారు.

(వాయిస్ 35 సెకన్లు)

ఆరు నెలల్లో ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామ మంత్రి అన్నారు. సోలార్ ప్లాంట్ వినియోగం వల్ల విద్యుత్ ఉత్పాదకత పెరిగి ప్రజలకు, పరిశ్రమలకు మేలు జరుగుతుందని తెలిపారు. అనంతరం అక్కడ నుంచి ఆయన అహోబిలం వెళ్లి నరసింహ స్వామి దర్శనం చేసుకున్నారు.

=====================

లోకానికి శాంతిని ప్రభోదించిన ఏసు క్రీస్తు మార్గం అనుసరణీయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. క్రీస్తు త్యాగాన్ని స్మరించుకుంటూ.. ఆయన బోధనలను పాటిస్తూ.. సర్వమానవ సమానత్వాన్ని, శాంతిని నెలకొల్పే దిశగా కృషి చేయాలని అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు ఏసుక్రీస్తుకు నివాళులు అర్పించడం, దేవదూత ప్రబోధాలను ఆచరణలో చూపడం జరుగుతుందని అన్నారు.

ఏసు క్రీస్తు త్యాగాలను గుడ్ ఫ్రైడే సందర్భంగా గుర్తు చేసుకోవాలని, ఆయన అందించిన ప్రేమ, కరుణ, క్షమాగుణాలు మనలో స్ఫూర్తిని అందిస్తాయని సామాజిక మాధ్యమం వేదికగా ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పంచుకున్నారు.

=====================

అంగన్వాడీ అధ్యాపకుల్లో ఆరోగ్యవంతమైన జీవనశైలి, శారీరక దృఢత్వాన్ని పెంపొందించడానికి చర్యలు చేపట్టామని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఈరోజు పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో అంగన్వాడీ టీచర్లకు వర్కౌట్ మెటీరియల్‌ను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అంగన్వాడీ టీచర్లు గ్రామీణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారు ఆరోగ్యంగా ఉంటేనే సమాజానికి మెరుగైన సేవలను అందించగలరని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ విధులను నిబద్ధతతో నిర్వహించాలని, విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా ప్రజలకు ఉత్తమ సేవలను అందించే దిశగా పని చేయాలని మంత్రి సూచించారు.

=====================

రతన్ టాటాకు భారత రత్నా ఇవ్వాలని ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కే రఘు రామకృష్ణరాజు ఆకాంక్షించారు. ఈరోజు గుంటూరు సమీపంలో ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రతన్ టాటా విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ విషయంపై తాను గతంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లేఖ రాయడం జరిగిందన్నారు. విద్యా, వైద్య రంగాలలో రతన్ టాటా విశేష సేవలు అందించారని చెప్పారు. రతన్ టాటా  వ్యాపారవేత్తే కాదని, గొప్ప మానవతావాది అని ప్రజల హృదయాలలో ఆయన చిరస్థాయిగా ఉండిపోతారని అన్నారు.

విరామం

=====================

రైతులకు వర్షాకాలంలో ముంపును నివారించడానికి దమయపర్తి డ్రైన్ పనులను చేపడుతున్నామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం వద్దిపర్రు వద్ద దమయపర్తి డ్రైన్ పనులను మంత్రి ఈరోజు పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేసారు. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దీనికి పరిష్కారం చూపే దిశగా డ్రైన్ పనులు చేపట్టామని తెలియజేస్తూ...

(వాయిస్ 24 సెకన్లు)

అనంతరం పోడూరు మండలం 3 గ్రామాల్లో 2 కోట్ల 62 లక్షల రూపాయలతో పంట కాలవ వెంబడి గ్రావెల్ రహదారుల పనులను మంత్రి రామానాయుడు ప్రారంభించారు.

=====================

పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలన్నదే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ఈరోజు విశాఖలోని కింగ్ జార్జ్ ఆసుపత్రిలో మంత్రి పర్యటించి ఆసుపత్రి రోగులతో మాట్లాడి అక్కడ అందిస్తున్న వైద్య సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో పలు రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. రోగులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, కోటి రూపాయల వ్యయంతో క్యాజువాల్టీ వార్డులో మరమ్మతులు చేస్తున్నామని, నూతనంగా మరొక గైనకాలజీ వార్డుకు ప్రతిపాదనను పంపామని అన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధించడం ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్షమని.. దీనికి అనుగుణంగా వైద్యులు, సిబ్బంది పని చేయాలని మంత్రి సూచించారు.

=====================

భారతీయ సంస్కృతి, చరిత్రకు ప్రతిబింబాలుగా అరుదైన స్టాంపులు, నాణాలు నిలుస్తాయని విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు ఎం.శ్రీ భరత్ అన్నారు. ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు విశాఖ బీచ్ రోడ్ లోని హవా మహల్లో ఏర్పాటు చేసిన స్టాంపులు, నాణాలు, పురాతన వస్తువుల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... భారతీయ వైభవానికి, చరిత్రకు నిదర్శనంగా ఇవి నిలుస్తాయన్నారు. భారతీయ వారసత్వాన్ని, విశిష్టతను ప్రముఖుల జీవిత విశేషాలు, ప్రత్యేక సందర్భాలను వివరించే విధంగా ప్రదర్శన ఏర్పాటు చేశారు. అరుదైన పోస్టల్ స్టాంపులు, వందల సంవత్సరాల నాటి రాజుల కాలంలో చెలామణిలో ఉన్న నాణాలు, చారిత్రక వస్తువులను ఈ ప్రదర్శనలో ఉంచారు.

=====================

అగ్ని వీర్ పథకంలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తు గడువును ఈనెల 25వ తేదీ వరకు పొడిగించామని విశాఖపట్నంలోని ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఆంధ్రప్రదేశ్  లోని 13 జిల్లాలు, యానాం నుంచి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడిచింది. అగ్ని వీర్ లో రెండు విభాగాలలో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఆన్ లైన్ కామన్ ఎంట్రన్స్ పరీక్షను 13 భాషల్లో తొలిసారిగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్. సి.సి.లో - ఏ, బి, సి సర్టిఫికెట్ కలిగిన వారికి,  క్రీడాకారులకు, ఐటిఐ, డిప్లమో అర్హత కలిగిన వారికి బోనస్ మార్కులు కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు అగ్ని వీర్ జనరల్ డ్యూటీ, అగ్ని వీర్ టెక్నికల్,  క్లర్క్/ స్టోర్ కీపర్, అగ్ని వీర్ ట్రేడ్స్ మెన్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొంది.

=====================

ప్రజలందరి భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం విజయవంతం చేయాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. పారిశుద్ధ్యం, పరిశుభ్రతను పెంపొందించేందుకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతీనెలా 3వ శనివారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణపై శ్రవణ మాధ్యమం ద్వారా వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలకు దిశా నిర్దేశం చేశారు. ఇ-చెక్ అనే ప్రధాన అంశంగా రేపు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

=====================
=====================